జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

టీఎన్జీవో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

సిద్దిపేట అర్బన్, జనవరి 18 : ఉద్యోగులు బాగా పని చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో టీఎన్జీవో నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎన్జీవోలు భవిష్యత్‌లో మరెన్నో మంచి కార్యక్రమాలు చేయాలన్నారు. ఉద్యోగులకు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరమేశ్వర్, విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కరిస్తానన్న కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో ఎక్కువగా పనిచేసే వారిలో సిద్దిపేట జిల్లా ఉద్యోగులని గర్వంగా చెబుతామన్నారు. అనంతరం సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధను టీఎన్జీవో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పలువురు టీఎన్జీవో నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మర్కూక్, జనవరి 18 : జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కార్యవర్గ సభ్యుల సమక్షంలో ఆవిష్కరించారు. అనంతరం జిల్లా పరిపాలనాధికారి ప్రశాంత్‌జీవన్ పాటిల్, సీపీ అనురాధను వేర్వేరుగా కలిసి క్యాలెండర్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ కార్యవర్గ అధ్యక్షుడు, ములుగు, మర్కూక్ మండలాల ఇన్‌చార్జి ఎం.ప్రవీణ్‌కుమార్, జనరల్ సెక్రటరీ నాగేందర్‌రెడ్డి, ఏవోలు తదితరులు పాల్గొన్నారు.

సీపీ అనురాధకు క్యాలెండర్‌ను అందజేస్తున్న ఉద్యోగులు

ఫరూఖ్ హుస్సేన్‌కు పరామర్శ

మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 18 : అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్‌ను గురువారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పరామర్శించారు. ఫరూఖ్‌హుస్సేన్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు గాలి అనిల్‌కుమార్, సికిందర్ తదితరులు ఉన్నారు.

కూడవెల్లి రామలింగేశ్వరాలయంలో జాతర టెండర్లు

కూడవెల్లి రామలింగేశ్వరాలయంలో టెండర్లు నిర్వహిస్తున్న ఈవో విశ్వనాథశర్మ

దుబ్బాక, జనవరి 17 : దక్షిణ కాశీగా పేరొందిన కూడవెల్లి రామలింగేశ్వరాలయంలో గురువారం మాఘామవ్యాస జాతరకు సంబంధించిన టెండర్లు నిర్వహించారు. ఈవో విశ్వనాథశర్మ, చైర్మన్ పుజాల చంద్రం, అర్చకులు, సర్పంచ్, పాలకవర్గం ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించారు. పులిహోర, లడ్డూ ప్రసాదం విక్రయానికి రూ.4. 46 లక్షలకు అంబటి దేవయ్య(బీము ని మల్లారెడ్డిపేట), కొబ్బరికాయలు రూ.2. 31 లక్షలకు నగరం గ్రామానికి చెందిన గజబీంకార్ అశోక్ వేలం పాటలో దక్కించుకున్నారు. ఆలయంలో డెకరేషన్, విద్యుత్ దీపాలు, పూల అలంకరణతో పాటు మరమ్మతులకు సంబంధించిన టెండర్లు నిర్వహించారు. ఫిబ్రవరి 9 నుంచి 13 వరకు ఆలయంలో జాతర కొనసాగుతుందని ఈవో తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు.

'అద్దంకి'కి ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రివర్గంలో చోటు కల్పించాలి

చేర్యాలలో నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు నాయకులు

చేర్యాల, జనవరి 18 : సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధిష్టానం పునరాలోచించి అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రివర్గంలో చోటు కల్పించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారాయణ కోరారు. అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మాలమహానాడు ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అద్దంకి దయాకర్‌పై అగ్రవర్ణాలు కుట్రలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. కాంగ్రెస్‌లో రెడ్డి సామాజికవర్గం సీనియర్ నాయకులు కుట్రపన్ని అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ పదవి ఇచ్చినట్టే ఇచ్చి.. గంటల వ్యవధిలో రద్దు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అద్దంకికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రివర్గంలో చోటు కల్పించాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో మాల మహానాడు జిల్లా కార్యదర్శి కమలాపురం కిష్టయ్య, నాయకులు మేడిపల్లి నరసింహ, డివిజన్ అధ్యక్షుడు చింతల విజయ్ కుమార్, నాయకులు గుస్క రామదాసు, పుట్ట యాదయ్య, బుట్టి భాగయ్య, పట్టణ అధ్యక్షుడు పుట్ట రాజు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి

గజ్వేల్, జనవరి 18 : తెలంగాణ మలిదశ ఉద్యమంలో రాజకీయ జేఏసీలో కీలక పాత్ర పోషించి కాంగ్రెస్‌లో చేరిన అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చి మంత్రివర్గంలో చోటు కల్పించాలని మాలమహానాడు జాతీయ నాయకుడు తుమ్మ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అద్దంకికి ఎమ్మెల్సీ పదవి ఆశచూపి చివరకు కాంగ్రెస్ పెద్దలు ఆయనకు మెండిచేతి చూపడం భావ్యం కాదన్నారు. పదేండ్లుగా కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పనిచేసిన ఆయనకు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వకుండా మోసం చేశారన్నారు. వెంటనే దయాకర్‌కు ఎమ్మెల్సీతోపాటు మంత్రి పదవి ఇవ్వాలన్నారు. లేదంటే మాలమహానాడు ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

అనాథలైన చిన్నారులు

నాడు తల్లిదండ్రులు, నేడు నానమ్మ మృతి

మృతదేహం వద్ద రోదిస్తున్న చిన్నారులు

జగదేవ్‌పూర్, జనవరి 18 : అన్ని తానై చూసుకుంటున్న నానమ్మ అకాల మరణంతో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. ఈ ఘటన మండలంలోని అంతాయగూడెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నల్ల యాదమ్మ(65)కు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు గతంలో అనారోగ్యంతో మృతి చెందాడు. యాదమ్మ తన కోడలు, ఇద్దరి మనుమళ్లను తీసుకొని హైదరాబాద్‌కు బతుకుదెరువు కోసం వెళ్లింది. అక్కడే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఆరేండ్ల క్రితం కోడలు కూడా అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి అన్నీ తానై మనుమళ్లను నానమ్మ చూసుకుంది. యాదమ్మ గురువారం అకాల మరణంతో ఆమె మనుమళ్లు అనాథలయ్యారు. మృతురాలి అంత్యక్రియలు గ్రామంలో చేపట్టారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబసభ్యులను సర్పంచ్ సత్యం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన హమాలీ సంఘం నాయకులు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. అనాథలైన చిన్నారులను దాతలు ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

నవోదయ ఎంట్రెన్స్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

వర్గల్, జనవరి 18 : వర్గల్ జవహర్ కేంద్రీయ నవోయద విద్యాలయ సమితి 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 20న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు వర్గల్ నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ డి.రాజేందర్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎంట్రె న్స్ పరీక్ష కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. మొత్తం 80 సీట్ల భర్తీ కోసం సిద్దిపేట జిల్లాలో 10 పరీక్షా కేంద్రాల్లో 2182 మంది, మెదక్ జిల్లాలో 7 పరీక్షా కేంద్రాల్లో 1501 మంది, సంగారెడ్డి జిల్లాలో 12 పరీక్షా కేంద్రాల్లో 2113 మంది విద్యార్థులు పోటీపడుతున్నారని తెలిపారు. ఒక్కో సెంటర్‌కు ఒక్కో పరిశీలకుడి చొప్పున మొత్తం 29 మందిని అలర్ట్ చేశామన్నారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్

సిద్దిపేట అర్బన్, జనవరి 18 : రేపు జరుగనున్న నవోదయ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా లో 12 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద ఈనెల 20న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడవద్దని, పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను సీపీ ఆదేశించారు. విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకొని ప్రశాంతంగా పరీక్ష రాయాలని సూచించారు.

మల్లన్నసాగర్ బాధితులకు న్యాయం చేయాలి

గజ్వేల్, జనవరి 18 : మల్లన్నసాగర్ ప్రాజెక్టు బాధితులు, ముంపు గ్రామాల ప్రజల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ముంపు గ్రామాల ప్రజల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభు త్వం చొరవ చూపాలన్నారు. కోర్టును ఆశ్రయించిన వృద్ధులు, ఒంటరి మహిళలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో అనేక మందికి అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించాలన్నారు.

20న 'పంబాల' మహాసభ

చేర్యాల, జనవరి 18 : తెలంగాణ రాష్ట్ర పంబాల సంఘం ఏర్పాటు చేసి రెండేండ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 20న ద్వితీయ వార్షిక మహాసభను పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటం వెంకటేశ్ తెలిపారు. గురువారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ద్వితీయ వార్షిక మహాసభకు సిద్దిపేట, జనగామ, యాదాద్రి జిల్లాల నుంచి పంబాల కుల బాంధవులు అధిక సంఖ్యలో తరలిరానున్నట్లు తెలిపారు. సభకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు చెప్పారు. సమావేశంలో నాయకులు సుద్దాల రంజిత్, సుద్దాల శ్రీకాంత్, గడ్డం సాయిశ్యామ్, సుద్దాల సాయి తదితరులు పాల్గొన్నారు.

21న రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

కొమురవెల్లి, జనవరి 18: మండలంలోని కిష్టంపేట పద్మశ్రీ గార్డెన్‌లో ఈనెల 21న జపాన్ కరాటే షో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో 14వ రాష్ట్ర స్థాయి కరాటే టెస్ట్ టోర్నీ నిర్వహించనున్నట్లు జపాన్ కరాటే షో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, చీఫ్ ఇన్‌స్పెక్టర్ సెన్సాయి ఎమ్మెస్ పాషా(బ్లాక్ బెల్ట్ ఆరో డాన్) ప్రకటనలో పేర్కొన్నారు. టోర్నీలో వివిధ జిల్లాల నుంచి 300 మంది విద్యార్థులతో పాటు 50 మంది బ్లాక్ బెల్ట్ మాస్టర్లు పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, కొమురవెల్లి ఎస్సై నాగరాజు హాజరై విజేతలకు సర్టిఫికెట్స్‌తో పాటు మెడల్స్ అందజేయనున్నట్లు తెలిపారు.

మెరుగైన సేవలు అందించాలి

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 18 : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యసిబ్బంది కృషి చేయాలని మద్దూరు మండలంలోని లద్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుధీర్‌రాజ్ అన్నారు. గురువారం లద్నూర్ పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో వైద్యాధికారి మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వివిధ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. అసంక్రమిత వ్యాధుల పట్ల ప్రజల్లో నెలకొన్న భయాన్ని తొలిగించి, వారికి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏఎంఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ములుగు, జనవరి 18 : ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ములుగు మండలం తునికిబొల్లారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ వివరాల ప్రకారం.. మండలంలోని అచ్చాయపల్లికి చెందిన నకిర్తి శ్యామల(40) బుధవారం ఉదయం ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. అదేరోజు సాయంత్రం ఆమె భర్త వెంకటేశ్ ములుగు పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేయించారు. కాగా, గురువారం ఉదయం 7 గంటల సమయంలో తునికిబొల్లారం గ్రామ శివారులోని ఓ చెట్టుకు శ్యామల ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఇది గమనించిన గ్రామస్తులు వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శ్యామల (ఫైల్)

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

పనిభారం తగ్గించాలని డిమాండ్

దుబ్బాక బస్ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

దుబ్బాక, జనవరి 18 : తమకు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం దుబ్బాక ఆర్టీసీ బస్ డిపో ఎదుట ఆర్టీసీ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు మాట్లాడుతూ రెండు నెలలుగా ఆర్టీసీ అధికారులు తమపై పనిభారం మోపి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణ విధులతోపాటు నిత్యం ఆరేడు గంటలు అదనంగా పని చేయించుకుంటున్నారని తెలిపారు. ఓటీ (ఓవర్ టైమ్) పేరిటా ఆరేడు గంటలు పని చేయించుకుని, కేవలం రెండు గంటలకు సరిపడా వేతనం ఇస్తున్నారని చెప్పారు. తమను అనారోగ్యానికి గురిచేస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. తరచూ డిపోలోని కంప్యూటర్‌లో సంకేతిక కారణాలతో సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. సాంకేతిక కారణాలతో 75 శాతం బస్‌లు డిపో నుంచి బయటకు రాలేకపోయాయని చెప్పారు. తమకు ఓటీ డ్యూటీ లు కాకుండా స్పెషల్ డ్యూటీలు వేయాలని కోరారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట డీఎం దుబ్బాకకు వచ్చి ఇన్‌చార్జి డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి, ఆర్టీసీ ఉద్యోగులతో మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని డీఎం హామీ ఇచ్చారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన విరమించారు.

విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిని శిక్షించాలి

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 18 : హైదరాబాద్‌లోని అల్విన్ కాలనీలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీఆర్‌ఎస్ ధూళిమిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి గురువారం ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో ఉద్యమకారులను ఏకం చేసిన జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. అదే స్థలంలో జయశంకర్ నూతన విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలన్నారు.

చేర్యాలలో..

చేర్యాల, జనవరి 18 : హైదరాబాద్ నగరంలోని అల్విన్ కాలనీలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని జిల్లా విశ్వబ్రాహ్మణ యూత్ అధ్యక్షుడు తాటికొండ సందానందం డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసుల ముందే జయశంకర్ సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసినా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు.

స్టాంప్ వెండర్లపై చర్యలు తీసుకోవాలి

సబ్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

హుస్నాబాద్, జనవరి 18 : పట్టణంలోని స్టాంప్ వెండర్లు స్టాంపులను అధిక ధరలకు విక్రయిస్తూ వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్, బీఎస్పీ నాయకుడు శంకర్ అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో సుమారు 10 మంది స్టాంప్‌వెండర్లు ఉన్నారని, వీరందరూ కుమ్మక్కై స్టాంపుపై ఉన్న ధరకంటే రూ.30 నుంచి రూ.50 అదనంగా వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు విధిలేక అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా సబ్ రిజిస్ట్రార్ స్పందించి అధిక వసూళ్లకు పాల్పడుతున్న స్టాంప్‌వెండర్లపై చర్యలు తీసుకోవాలన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

దుబ్బాక, జనవరి 18 : దుబ్బాక మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విమలారెడ్డి తెలిపారు. గురువారం గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దుబ్బాక మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించేందుకు ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 5వ తరగతి ప్రవేశాలకు మొదట మైనార్టీలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. తర్వాత మిగతా వారికి లక్కీడ్రా ద్వారా సీట్లు కేటాయిస్తారని తెలిపారు. 6 నుంచి 8వ తరగతి వరకు, జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్, జనవరి 18 : హుస్నాబాద్ పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీవాణి ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతితోపాటు ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్ ఫొటోతోపాటు నేరుగా లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

గజ్వేల్ అర్బన్, జనవరి 18 : తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి గడువును ఈనెల 20 వరకు పొడిగించినట్లు వర్గల్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని, ఫిబ్రవరి 11న రాత పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. పూర్తి వివరాల కోసం 18004 2545678 టోల్‌ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

సిద్దిపేట టౌన్, జనవరి 18 : దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి తెలిపారు. దాడికి సంబంధించిన వివరాలను గురువారం ఏసీపీ వెల్లడించారు. పట్టణానికి చెందిన సతీశ్‌గౌడ్ బుధవారం రాత్రి సీతారామ్‌నగర్ వైపు కారులో వెళ్తుండగా, మరో కారులో శ్రీకాంత్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో తనకు సైడ్ ఇవ్వాలని సతీశ్‌గౌడ్ కోరగా, శ్రీకాంత్ సైడ్ ఇవ్వకుండా దుర్భాషలాడాడు. అంతటి అగకుండా శ్రీకాంత్ తన అనుచరులతో కలిసి దాడి చేశాడని సతీశ్‌గౌడ్ ఫిర్యాదు చేశాడు. సతీశ్‌పై తాము దాడి చేయలేదని, తమపై సతీశ్ అనుచరులు దాడి చేశారని శ్రీకాంత్ ఫిర్యాదు చేశాడు. ఇరువర్గాలపై కౌంటర్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏసీపీ తెలిపారు.

బస్సు ఢీకొని మహిళ మృతి

సిద్దిపేట టౌన్, జనవరి 18 : బస్సు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై రంజిత్ వివరాల ప్రకారం.. దొమ్మాటకు చెందిన భూదవ్వ(55) కొంతకాలంగా సిద్దిపేటలోని ఓ హోటల్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. రోజు మాదిరిగా హోటల్‌లో పనిచేసేందుకు వెళ్తున్న క్రమంలో పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ వద్దకు రాగానే సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు భూదవ్వను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. బస్సు డ్రైవర్ రాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం

- రైతు పొలంలో విరిగిన విద్యుత్ స్తంభం
- పట్టించుకోని అధికారులు

విరిగి ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 18 : మద్దూరు మండలం రేబర్తి, లక్కపల్లి గ్రామాల మధ్యలోని వ్యవసాయ పొలంలో కొన్ని నెలల కింద విద్యుత్ స్తంభం విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ విషయాన్ని రైతులు పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వారు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విరిగిన విద్యుత్ స్తంభం ఎప్పుడు కూలుతుందోనని రైతులు భయపడుతున్నారు. విద్యుత్ అధికారు లు తక్షణమే స్పందించి విరిగిన స్తంభాన్ని తొలిగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

తహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

చేర్యాల, జనవరి 18 : తహసీల్దార్ రాజేశ్వర్‌రావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం నాయకులు గురువారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈనెల 13న జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి తహసీల్దార్ చేర్యాల పెద్దచెరువు కట్టను పరిశీలించారని తెలిపారు. చెరువుకట్ట అభివృద్ధికి రూ.2.95 కోట్ల నిధులతో ఐబీశాఖ పనులు చేపట్టిందని, ఈ పనులతో సంబంధం లేని తహసీల్దార్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎలా పర్యటిస్తారని ప్రశ్నించారు. విచారణ చేపట్టి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసినవారిలో నాయకులు కొంగరి వెంకట్‌మావో, రాళ్లబండి నాగరాజు, రంజిత్, అరుణ్‌కుమార్, రవికుమార్, శశిధర్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

హుస్నాబాద్ టౌన్, జనవరి 18 : పట్టణంలోని పలు అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ ఎంఆర్ రాజశేఖర్ గురువారం పరిశీలించారు. స్థానిక కరీంనగర్ రోడ్‌లో నిర్మిస్తున్న వైకుంఠధామం, రామవరం రహదారిలో నిర్మిస్తున్న ఎఫ్‌ఎస్‌టీపీ పనులు, సిద్ధేశ్వరస్వామి గుట్టపై కొనసాగుతున్న మంచినీటి పైపులైన్ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. పట్టణవాసులకు ఇబ్బంది కలుగకుండా మిషన్ భగీరథ ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని సిబ్బందికి కమిషనర్ సూచించారు.

బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలి

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 18 : స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు తీసుకున్నవారు సకాలంలో చెల్లించాలని మద్దూరు ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ హరిప్రసాద్ సూచించారు. గురువారం జాగృతి మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ ఏపీజీవీబీ పరిధిలో 40 గ్రామైక్య సంఘాలు రూ.కోటీ 5 లక్షల రుణాలు చెల్లించాల్సి ఉందన్నారు. ఏండ్ల తరబడి పేరుకుపోయిన మొండి బకాయిలను మహిళా సంఘాల సభ్యులు చెల్లించాలన్నారు. అర్హత కల్గిన గ్రామైక్య సంఘాలకు కొత్తగా రుణాలు ఇస్తామని చెప్పారు. అనంతరం డీపీఎం విద్యాసాగర్‌కు బకాయిల లిస్ట్‌ను అందజేశారు. సమావేశంలో ఏపీడీ రవీందర్, సీసీలు ప్రేమలత, మహేందర్, సిద్ది మల్లయ్య, సీఏలు, గ్రామైక్య సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగుల ఎంపిక

సిద్దిపేట అర్బన్, జనవరి 18 : శారీరక దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ కోసం గురువారం సిద్దిపేట కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధ్యక్షతన స్క్రీనింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేశారు. ఈ మేరకు మోటరైజ్డ్ త్రీవీలర్ వెహికిల్ కోసం 11 మంది, లాప్‌టాప్‌ల కోసం ముగ్గురు, 4జీ స్మార్ట్‌ఫోన్ కోసం నలుగురిని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE ADDL SENIOR CIVIL JUDGE AT SIDDIPET

O.S.No. 91 of 2022

Between:
Banda Chandra Mohan ...Plaintiff
And
A. Usha Rani & Others ...Defendants
To:
D8: Banda Saraswathi, D/o Late Mallesham, Age: 42yrs, Occu: House-hold, R/o Sreenagar Colony, Street No.6, Near Balaji Talkies, Cherial Village and Maddur Mandal, Siddipet Dist.

NOTICE

Please take notice that the above named plaintiff has filed the above suit against you and others for Declaration of title, the Hon'ble court issued summons to your residential address, but the same has returned with the endorsement door locked, due to that the said summons were returned and un served, the above suit is posted for your appearance in the above said court on 12-02-2024 by 10.30 am in person or by an advocate. If you failed to attend to the said court on the said date, the matter will be heard and determined ex-parte.

// BY THE ORDER OF THE HON'BLE COURT //
Sd/- **D. HARIPRASAD YADAV**
ADVOCATE,
Jangaon Town & Dist.
Cell: 9849062129

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచడము ఏమనగా శ్రీ కూరపాటి భాస్కర్ తండ్రి సిద్దయ్య, నివాసం: సిద్దిపేట గారు, శ్రీ గాడిచెర్ల సత్యం గార్కి రిజిస్టర్ విక్రయ దస్తావేజు నం. 13069/2022 S.R.O. సిద్దిపేట ద్వారా సంక్రమించిన సిద్దిపేట పట్టణము (పాత జి.పి. ప్రశాంత్‌నగర్)లో గల సర్వే నం. 1296లోని ప్లాటు నం. 18లో నూతనంగా నిర్మించిన బిల్డింగ్ విస్తీర్ణం 120 చ.గ.లు గల ఆస్తి ఖరీదు చేయుటకు నా క్లయింట్ అగు Can Fin Homes Ltd., సిద్దిపేట బ్రాంచ్ యందు లోన్ కొరకు సంప్రదించినారు. సదరు ఆస్తి యొక్క ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ నం. 3390/1996 S.R.O. సిద్దిపేట గలది పోయినట్లుగా తెలియజేసినారు. కావున పై ఆస్తిపై గానీ, ఒరిజినల్ లింకు దస్తావేజు విషయంలో గానీ ఎవరికైనా ఏలాంటి ఆక్షేపణలు ఉన్న ఎడల సంబంధిత ఒరిజినల్ ఆధారాలతో (7) దినములలోగా నా కార్యాలయంలో సంప్రదించగలరు. గడువు తర్వాత నా క్లయింటు బ్యాంకు సంబంధిత డాక్యుమెంట్ యొక్క నకలు కాపీతో శ్రీ కూరపాటి భాస్కర్ గారికి లోన్ మంజూరు చేయుదురు. తదుపరి ఎవరి ఆక్షేపణలు చెల్లనేరవు.

Sd/- **K. SAI NARAYANA,** Advocate
Siddipet, **Cell: 98483 19114.**